క్లుప్తంగా

నివాళి..పరామర్శ



కుమార్ కుటుంబాన్ని ఓదారుస్తున్న దుర్గ

రామకుప్పం: మండలంలోని ఉన్సిగానిపల్లె పంచాయతీ జౌకుపల్లె గ్రామ వార్డు సభ్యుడు కుమార్ భార్య శారద ఆదివారం మృతి చెందింది. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ఆ గ్రామానికి వెళ్లారు. శారద మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నేతలు నాగిరెడ్డి, మురుగేష్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం పిల్లలకు నేర్పాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రభోద సేవా సమితి సభ్యులు

పలమనేరు: భగవద్గీతను పఠించడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ కోరారు. ఉగాదిని పురస్కరించుకుని మున్సిపాలిటీలోని నీళ్లకుంటలో ఆదివారం భగవద్గీతపై వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బాలాజి, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: ఒకరి అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని గొదమాకుపల్లెలో ఆదివారం సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం .. గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు రాజన్న సారా విక్రయిస్తున్నాడనే సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. నిందితుడి నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: సారాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ శివకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని వీర్నమల సమీపంలో సారా విక్రయిస్తున్నట్టు రహస్య సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. గ్రామానికి చెందిన సురేష్ నాయక్, ముగేనాయక్ వద్ద 10 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్ తరలించారు.

కేంద్ర బలగాల కవాతు



పలమనేరు: ఎన్నికల నేపథ్యంలో పలమనేరు మండలంలోని సమస్యాత్మక పంచాయతీలైన టి.వడ్డూరు, మండిపేట కోటూరులో ఎస్పీ మణికంఠ చందోల్ ఆదేశాలతో స్థానిక పోలీసులతో కలసి కేంద్ర బలగాలు ఆదివారం కవాతు నిర్వహించాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడడమే తమ లక్ష్యమని పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సహదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగజాతర ప్రారంభం



ప్రత్యేకాలంకారంలో సదుమమ్మ

సదుం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో గంగజాతర వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పాలమంద, రెడ్డివారి పల్లె, నడిగడ్డ పంచాయతీ కురవపల్లె, బూరగమందలో జాతర సందడి నెలకొంది. పాలమంద నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అరవపాలెం సిలంకూరి ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్థానిక సదుమమ్మ ఆలయంలో మహిళలు పొంగళ్లు పెట్టారు. గ్రామ సరిహద్దులో ఉన్న గంగరాళ్లకు పూజలు చేసి, అంబలి పంచిపెట్టారు. నడివీధిలో గంగమ్మను అర్ధరాత్రి ప్రతిష్ఠించారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ

వి.కోట: క్రోధి నామ సంవత్సర నూతన తెలుగు క్యాలెండర్లను మండల ప్రభోధసేవా సమితి సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండలంలో తోటకనుమలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రభోద సేవాసమితి మండల అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రతి ఏటా సమితి ఆధ్వర్యంలో ఉగాది నూతన క్యాలెండర్లను ముద్రించి మండల ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాలెండర్లలో భగవద్గీత వచనాలు, తెలుగు పండుగల విశిష్టతపాటు కాలసూచికలను అందరికీ అర్థమయ్యే భాషలో ముద్రించినట్లు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తుల కూటమికి గుణపాఠం చెబుదాం

- వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి
- బాబు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదు .. ఇక ప్రజలకు ఏం చేస్తారు?
- ఆయన హయాంలో చేసింది శూన్యం
- మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి
- 'మేమంతా సిద్ధం' సభల్లో ఎంపీ, జెడ్పీ చైర్మన్

చౌడేపల్లె: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేదంటూ ఉమ్మడి కూటమి కుట్రలు, కుతంత్రాలకు సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి ఆగిపోతుందని, పేద ప్రజలకు కష్టాలు తప్పవని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఏ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట, పందిళ్లపల్లె, ఆమినిగుంట, పరికిదొన, గడ్డంవారిపల్లె, కొండామర్రి, వెంగళపల్లె, దిగువపల్లె, కాగతి, కాటిపేరి, లద్దిగం, పుదిపట్ల, చింతమాకులపల్లె, కొండయ్యగారిపల్లె, పెద్దయల్లకుంట్ల, చౌడేపల్లె లలో మేమంతా సిద్ధం సభలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి రాత్రి8 గంటల వరకు ఈ సభల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు ఎంపీ, జెడ్పీ చైర్మన్, పలువురు నాయకులు పాల్గొని విస్తృత ప్రచారం చేశారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేయాలని అభ్యర్థించారు.

అభివృద్ధి చూసి ఓటువేయండి : ఎంపీ



సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరును ఆదర్శవంతంగా చేశారని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. నియోజకవర్గానికి తాగు, సాగునీటిని అందించి దాహార్తి సమస్యలు లేకుండా చేయాలని, భూములను సస్యశ్యామలం చేయాలనే కృత నిశ్చయంతో ఏర్పాటు చేస్తున్న రిజర్వాయర్లను చంద్రబాబు కుట్రలు పన్ని అడ్డుకున్నారని విమర్శించారు. అభివృద్ధి చేస్తున్న వారికి ప్రోత్సహించడం విస్మరించి అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించి పొత్తుల కూటమికి గుణపాఠం చెప్పాలని కోరారు.

కుప్పానికి ఏం చేశావో చెప్పు బాబూ?: జెడ్పీ చైర్మన్



రాజకీయంగా చంద్రబాబును ఆదుకున్న కుప్పం ప్రజలకు చంద్రబాబు ఏమి చేశారో చెప్పాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చేయలేని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేశామని స్పష్టం చేశారు. కుప్పం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంతోపాటు కుప్పాన్ని మున్సిపాలిటీ చేశామన్నారు. మళ్లీ మాయమాటలు చెప్పి, ప్రజలు బురిడీ కొట్టించాలని యత్నిస్తున్న బాబు అండ్ కోకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మే13న నిర్వహించనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

షికారీల వందేళ్ల కల సాకారం



బోయకొండ పరిసర ప్రాంతాల్లోని షికారీలకు చెందిన భూములకు పట్టాలు కావాలని వంద ఏళ్లుగా పోరాటం చేస్తుంటే వారి కలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాకారం చేశారని పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లడ్డా రమణ కొనియాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన వారికి ఇంటి పట్టాలు, ఇళ్లు, పలు సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందాయన్నారు. ఇదే గత ప్రభుత్వ పాలనలో చూస్తే దీనికి పూర్తిగా భిన్నమని ప్రజలు గుర్తెరగాలని, దీనిని దృష్టిలో ఉంచుకుని జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి, ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు.

30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భరత్



మసీదులో ప్రార్థనలు చేస్తున్న భరత్

కుప్పం రూరల్: కుప్పం మండలం, అడవిబూదుగూరు పంచాయతీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆదివారం రాత్రి ఆ పంచాయతీలో ప్రచారానికి వెళ్లిన కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సమక్షంలో అడవిబూదుగూరు, సప్పానికుంట, ఎర్రగుట్టచేను, యానాదికాలనీలకి చెందిన 30 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, పార్టీలకతీతంగా అందజేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, నాయకులు శీను, రమేష్, రాజా, రాజేంద్రన్ పాల్గొన్నారు.

హిందూ–ముస్లింల సఖ్యతతోనే అభివృద్ధి

హిందూ–ముస్లింల సఖ్యతతోనే అభివృద్ధి సాధ్యమని కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ అన్నారు. ఆదివారం రాత్రి మల్లానూరు మసీదులో ముస్లింల ఆత్మీయ ఇఫ్తార్ విందుకు హాజరై ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమంతోపాటు ముస్లిం మైనారిటీ అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిగా చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పలమనేరు: పట్టణంలోని ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఆ అసోసియేషన్ స్థానిక శాఖ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి నేతృత్వంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గత నెల మృతి చెందిన అసోసియేషన్ సభ్యులు క్రిష్ణమూర్తి, గోపాలక్రిష్ణపిళ్లైలకు నివాళులర్పించి కాసేపు మౌనం పాటించారు. ఇటీవల ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 55మంది సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అనంతరం వార్షిక నివేదిక నివేదించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రత్నారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాన్ కా నిషాన్‌కో ఓట్ దాలో..!



నమాజు చేస్తున్న ముస్లింలు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెంకటేగౌడ



విందులో బిరియానీ వడ్డిస్తున్న ఎమ్మెల్యే

- ఇస్తిమాను తలపించిన ఇఫ్తార్ విందు
- ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేసిన పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ''అబ్ అకో టీడీపీ, బీజేపీ, జనసేన వాలే ఆకో ఏక్ హోజాకో ఎలక్షన్‌కొ జాతేయి. ఉనో జీతేతో ముస్లింవాలేకో ఓ చార్ పర్సంట్ రిజర్వేషన్ కాడ్లాంటీ కదే తుమే జరా సోచ్‌గా దేక్ లేవ్.. ఆనేకా ఎలక్షన్ మే తుమే కిసే ఓట్ దాల్నాకీ జరా సోచ్‌లేవ్.. హమే ఫ్యాన్ కా నిషాన్‌కో ఓట్ దాలో.. జగనన్నకు జీతానా.. ఏ పలమనేర్ మే గయే పాంచ్ సాల్ మే తుమే ముజే జితాయేహి.. ఆనేకా ఎలక్షన్ మే బీ వౌయిసాచ్ తుమారే మద్దత్ ముజే హోనా.. మైబీ తుమారా భాయ్..'' (వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన వాళ్లు జట్టుగా కలిసి ఎన్నికలకు వెళుతున్నారు. అధికారంలోకి వస్తే ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లను తీసేస్తామని బీజేపీ వాళ్లు అంటున్నారు.. వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తే మీకు మేలు కలుగుతుందో ఆలోచించండి.. మీకు మేలు జరగాలంటే.. మీరు సంతోషంగా ఉండాలంటే మళ్లీ మీరంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను గెలిపించుకోవాలి.. గత ఎన్నికల్లో మీరంతా నాకు అండగా నిలిచారు.. ఈ ఎన్నికల్లోనూ మీలో ఒకనిగా, మీ సోదరుడిగా భావించి నన్ను గెలిపించాలని వేడుకుంటున్నా..) అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ విజ్ఞప్తి చేశారు. స్థానిక మదనపల్లె రోడ్డులో ఎమ్మెల్యే వెంకటేగౌడ ముస్లింలకు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ ఇఫ్తార్ విందుకు పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు మండలం, గంగవరం మండలాలకు చెందిన వేలాదిమంది ముస్లింలు హాజరవడంతో 'ఇస్తిమా'ను తలపించింది. తొలుత ముస్లిం మత పెద్దలతో కలిసి సామూహిక నమాజు కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రార్థనలు చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆయన పైవిధంగా మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ముస్లిం మైనారిటీలకు చదువుల్లో 4శాతం రిజర్వేషన్లను పెట్టిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కిందన్నారు. అదే స్ఫూర్తితో ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి సైతం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసి వారికి ఉపయోగపడే పలు పథకాలను అమలు చేశారన్నారు. కూటమిగా ఒక్కటైన పార్టీలు వైఎస్సార్ సీపీని ఓడించేందుకు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని, ముస్లింలకు చెడు చేసే బీజేపీ, టీడీపీ కావాలా..మీకు మేలు చేసే జగనన్న కావాలో విజ్ఞతతో ఆలోచించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం పెద్దలు, మైనారిటీ నేతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి గొప్పదనమే వారసత్వ సంపద



జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు



ఉగాది వ్యాసరచన పోటీల్లో బహుమతులందుకున్న విద్యార్థులు

పలమనేరు: మన సంస్కృతి గొప్పదనాన్ని వారసత్వ సంపదగా భావించి, ఇప్పటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంతైనా ఉందని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదర్ నాయుడు అన్నారు. పట్టణంలోని కళామందిరంలో స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉగాది పురస్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గార్లపాటి మాట్లాడుతూ, తెలుగువారి పండుగలు, ప్రకృతికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. తెలుగు భాష కోసం కృషి చేస్తున్న ఇలాంటి సంస్థలు మరిన్ని పుట్టుకురావాలన్నారు. ఉగాది పర్వదినంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన అరవై మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన డాక్టర్ అగరం వసంత్ రచించిన «కథ మరిచిన మనిషి», «తల్లి వేరు» పుస్తకాలను కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం గీతాంజలి స్మారక సాహిత్య పురస్కారాన్ని పత్తిపాటి రమేష్ నాయుడుకు, జాతీయస్థాయి ఉగాది పురస్కారాలను భాస్కర్(కుప్పం), గండికోట వారిజ(పలమనేరు), వసంత, మునిరాజు(హోసూరు), వి.తిరుపతి, జనార్ధన్‌రావు, రాంబాబు(కేజీఎఫ్), లక్ష్మీకాంతమ్మ(మాలూరు), రామచంద్ర, రాఘవేంద్ర (బెంగళూరు), సుధాకర్(శ్రీకాళహస్తి), ఉమాదేవి(మదనపల్లె), గుణశేఖర్(గంగవరం), భాగ్యలక్ష్మి(కాణిపాకం), పూర్ణిమ (బంగారుపాళెం), జ్యోతి(నాగర్ కర్నూల్), చిరంజీవి(కడపనత్తం), బాలసుందరం, దొరస్వామినాయుడు, పార్థసారథి(పలమనేరు)లకు స్థానిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేణుగోపాలరెడ్డి, శ్రీనివాసులు, ఎన్జీవో అసోసియేషన్ నేత ఆనంద్‌బాబు, మాధవరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, విమల, ఉమామహేశ్వర్‌రెడ్డి, వివేక్, విజయ్ పాల్గొన్నారు.

జగనన్న దునియా చూపిత్తపా..!



నే బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తపా
డుగు డుగు..డుగు డుగు అని
జగనన్న దునియా చూపిత్తపా
సిద్ధం సిద్ధం సిద్ధం..సిద్ధమని..!
రాష్ట్రాభివృద్ధిని చూడండిరో
మమ్మును ఆశీర్వదించడిరో..!

అనే లెవెల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుల్లెట్టు బండిని స్టార్ట్ చేసేసరికి ఆ బండి కూడా నేను కూడా 'సిద్ధం' అన్నట్టు జోరుగా సౌండిచ్చింది! ఆదివారం మంత్రి 'మేమంతా సిద్ధం' పేరిట మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు ఎండను సైతం లెక్క చేయకుండా హుషారుగా పాల్గొని వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను కోరారు. దుర్గసముద్రంలో మంత్రి ఇలా బుల్లెట్ బైక్‌ను స్టార్ట్ చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టేసరికి పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పల్లెల వైపు దూసుకుపోయాయి. - చౌడేపల్లె

వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వండి

- న్యాయవాదులను కోరిన మంత్రి పెద్దిరెడ్డి



మంత్రి పెద్దిరెడ్డిని కలసిన న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు సహకరించి, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసేలా కృషి చేయాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి న్యాయవాదులను కోరారు. ఆదివారం నూతన న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులతో పాటు పలువురు న్యాయవాదులు మంత్రి పెద్దిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. చెన్నకేశవులను మంత్రి పెద్దిరెడ్డి సన్మానించారు.చెన్నకేశవులు మంత్రికి వినతిపత్రం అందజేసి న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఎన్నికల అనంతరం తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఏపీపీ హరినాథరెడ్డి, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, కేవీ ఆనందకుమార్, షమీవుల్లా, రాఘవేంద్ర, విజయ్‌కృష్ణ, వెంకట్రమణారెడ్డి, జహుర్‌బాషా, రెడ్డెప్ప పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటా 'పోకల' ప్రచారం



వినాయక్ నగర్‌లో ప్రచారం చేస్తున్న పోకల

పులిచెర్ల(కల్లూరు): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్ కోరారు. మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీలో ఆదివారం నల్లగుట్టపల్లె, వినాయక నగర్ , పెద్ద బెస్తపల్లెలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పుంగనూరు శాసన సభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ తిరిగి మరింత లబ్ధి పొందాలంటే వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాలని కోరారు. ఎంపీటీసీ పోకల చంద్ర, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, దామోదర్, గంగయ్య, వెంకట రెడ్డెప్ప, చంగల్‌రాయులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్



గంగవరం: రౌడీషీటర్లు తమ ప్రవర్తన, నడవడిక మార్చుకుని అందరితో మంచిగా మసలుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో ఇదివరకే పలు కేసుల్లో రౌడీషీటర్లుగా నమోదైన పలువురిని ఆదివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. ఇదివరకే పలు కేసుల్లో రౌడీషీటర్లుగా నమోదైన వాళ్లు ఎవరైనా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా, గ్రామాలు, పట్టణాల్లో గొడవలు సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడచుకుంటే వారి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రౌడీషీట్లను తొలగించడానికి తమ వంతు సహకారం ఇస్తామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



బైరెడ్డిపల్లెలో అవగాహన ర్యాలీ



పలమనేరు: మాట్లాడుతున్న డాక్టర్ యుగంధర్

బైరెడ్డిపల్లె: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే మూల్యం చెల్లించకతప్పదన్నారు. ప్రతి రోజూ యోగా, వ్యాయామం, ధ్యానం చేయడం మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో వీలైనంతవరకు దూరప్రయాణాలు చేయకుండా ఉండటమే శ్రేయస్కరమన్నారు. ఒకవేళ ఎండలో వెళ్లవలసి వస్తే తలపై రుమాలు లేదా టోపీగానీ ధరించాలన్నారు. చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనూష, హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీదేవి, సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు కంటే ఆరోగ్యమే ప్రధానం

పలమనేరు: ప్రస్తుతం పరుగులమయమైన యాంత్రిక జీవితంలో డబ్బు కంటే ఆరోగ్యమే ప్రధానమని గుర్తెరగాలని స్థానిక వైద్యులు, ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ యుగంధర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టకపోతే ఒక దశలో తమ సంపాదన అంతా ఆస్పత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. మంచి ఆహారపు అలవాట్లను పాటించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం వంటివి చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. వైద్యులు మల్లికార్జున రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.